క్లుప్తంగా

న్యూట్రీషన్ కిట్ల పంపిణీ



ఆత్మకూర్: నాట్కో ఫార్మా లిమిటెడ్, నాట్కో ట్రస్ట్ ఆధ్వర్యంలో క్షయ వ్యాధిగ్రస్తులకు న్యూట్రీషన్ కిట్లు అందజేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో క్లస్టర్ పరిధిలోని 59 మంది టీబీ వ్యాధిగ్రస్తులకు కిట్లు, మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు మదన్‌మోహన్, ఫయాజ్ అహ్మద్, సీహెచ్‌ఓ సురేష్‌కుమార్, విద్యాసాగర్, సురేందర్‌గౌడ్, టీబీ సూపర్‌వైజర్లు ధర్మ, రాంచందర్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మదనాపురం: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో 42 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లను జిల్లా ప్రోగ్రాం అధికారి సాయినాథ్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షయ వ్యాధిగ్రస్తులు పౌష్టికాహారం క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పరిమళ, డా. భవాని, సురేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్షయ నిర్ధారణ పరీక్షలు

పాన్‌గల్: మండలంలోని మల్లాయిపల్లిలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్, సీహెచ్‌ఓ రామయ్య తెలిపారు. 37 మందికి ఎక్స్‌రే, స్పుటం శాంపిల్స్ వంటి నిర్ధారణ పరీక్షలు చేశారు. అనంతరం మందుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీబీ జిల్లా కోఆర్డినేటర్ వినోద్, టెక్నీషియన్ ఈశ్వర్, ఎమ్ఎల్‌హెచ్‌పీ నాగరాజు, వైద్య సిబ్బంది సతీష్, ఎస్తేరమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి



ఆత్మకూర్: ఎస్ఎఫ్ఐ ఐదవ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు రాఘవ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో కలసి మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లకు సంబంధించి రూ.8 వేల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రభుత్వం విద్యా వ్యవస్థపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. మహాసభలకు వేలాది మంది పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు వినయ్, చందు, రమేష్, భాస్కర్, విద్యార్థులు పాల్గొన్నారు.


సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



పాన్‌గల్: మండలంలోని శాగాపూర్ గ్రామానికి చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను శుక్రవారం జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ చిన్నబాలరాజు యాదవ్ అందజేశారు. వంగూరు భాగ్యమ్మకు రూ.97,500, ముంతరాణికి రూ.14,500 వెంకటేష్‌కు రూ.17,500, ఆకునమోని నాగేంద్రానికి రూ.34 వేల విలువైన చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పెద్దబాలరాజు, నాగేష్, శ్రీను పాల్గొన్నారు.

వనపర్తి రూరల్: శ్రీరంగాపురం మండలంలోని కంభాళాపురం గ్రామానికి లబ్ధిదారులకు కాంగ్రెస్ గ్రామ నాయకులు శుక్రవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. గ్రామానికి చెందిన పింజారి మాబీకి రూ.19,500, నందిపేట శైలజ రూ.34 వేల విలువైన చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో బోయ కొండయ్య, మల్లేష్‌యాదవ్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



వీపనగండ్ల: మండలంలోని గోవర్ధనగిరి గ్రామంలో ఇటీవల ప్రమాదవశాత్తు మరణించిన రాఘవేందర్‌గౌడ్ కుటుంబాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు తనయుడు జూపల్లి అరుణ్‌బాబు, కొల్లాపూర్ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి తదితర నాయకులు పరామర్శించారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటస్వామి, కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.



అమరచింతలో దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నివాళులర్పిస్తున్న నాయకులు



కొత్తకోట చౌరస్తాలో జ్యోతిబాపూలే జయంతి వేడుకలు జరుపుకొంటున్న వివిధ పార్టీల నాయకులు



శ్రీరంగాపురంలో నివాళులర్పిస్తున్న నాయకులు

బలహీన వర్గాల ఆశాజ్యోతి

సాక్షి నెట్‌వర్క్: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిబాపూలే అని వామపక్షాల నాయకులు కొనియాడారు. శుక్రవారం జ్యోతిబా పూలే జయంతి వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. మనుషులంతా అన్ని రంగాల్లో సమానత్వంతో జీవించాలని, ఆధిపత్య విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తూ తన జీవితాన్ని ధారపోసిన సామాజిక తత్వవేత్త పూలే అని కొనియాడారు. మండల కేంద్రాలు, గ్రామాల్లో ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలోరాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్ డాక్టర్ గుమ్మడి వెన్నెల, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, వనపర్తి జిల్లా ఇన్‌చార్జ్ కోఆర్డినేటర్ మహ్మద్ నజీర్, బీసీ పొలిటికల్ జేఏసీ రాచాల యుగంధర్‌గౌడ్, వైస్ ప్రిన్సిపాల్ రామరాజు, డాక్టర్ కె.దామోదర్‌రెడ్డి, సతీష్‌యాదవ్, ముదిరాజ్ నాయకుడు గొనెల బాలస్వామి, డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, జిల్లా కాంగ్రెస్ ఓబీసీ చైర్మన్



వనపర్తిలో జ్యోతిబాపూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అఖిలపక్ష ఐక్యవేదిక ప్రతినిధులు

కోట్ల రవి, మత్స్యకార చైర్మన్ నందిమల్ల యాదయ్య, బాబా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సబిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాష్ట్ర ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధి శ్రీశైలం, ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, మహనీయుల స్ఫూర్తి వేదిక రాష్ట్ర చైర్మన్ రాజారామ్‌ప్రకాశ్ అధికారులు, ఆయా సంఘాల నాయకులు ప్రజలు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో నివాళులర్పిస్తున్న ధర్మ సమాజ్ పార్టీ నాయకులు



ఆత్మకూర్‌లో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు



పానగల్ మండలం దావాజిపల్లెలో నివాళులర్పిస్తున్న నాయకులు

పోషకాహారంపై అవగాహన

మదనాపురం: శుక్రవారం ఐసీడీఎస్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో పోషణ పక్వాడ కార్యక్రమం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం–2లో నిర్వహించారు. డాక్టర్ భవాని, కేవీకే శాస్త్రవేత్త అనిత, ఐసీడీఎస్ సుపర్‌వైజర్ భారతి పాల్గొని గర్భిణులు, బాలింతలకు అనుబంధ ఆహారంపై అవగాహన కల్పించారు. అనంతరం వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో గ్రేసీ, పుష్ప, శారద, అరుణ, ఆశాలు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: మండల పరిధిలోని కనిమెట్ట అంగన్‌వాడీ కేంద్రం–1లో అంగన్‌వాడీ టీచర్ తిరుమలేశ్వరి ఆధ్వర్యంలో పోషణపక్వాడ కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీ డాక్టర్ నిహారిక ముఖ్య అతిథిగా హాజరై గర్భిణులు, కిషోర బాలికలకు రక్త పరీక్షలు నిర్వహించారు. రక్తహీనతపై అవగాహన



మదనాపురంలో పోషణ పక్వాడ కార్యక్రమంలో అధికారులు

కల్పించడంతో పాటు బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం లక్ష్మయ్య, ఆశ కార్యకర్తలు ఇంద్రమ్మ, భాగ్యశ్రీ,, జరీనా, ఆయా మన్నెమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ



వనపర్తి రూరల్: మండలంలోని కడుకుంట్ల గ్రామానికి చెందిన డీఈఈ వెంకటేశ్వర్‌రెడ్డి గ్రామంలోని వివేకానందా గ్రంథాలయానికి కాంపిటేటివ్‌కు సంబంధించిన పుస్తకాలు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రంథాలయానికి అని వేళలా సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వెంకటేశ్వర్‌రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి

ఖిల్లాఘనపురం: ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న వరి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల సింగిల్ విండో చైర్మన్ మురళీధర్‌రెడ్డి, వైస్ చైర్మన్ క్యామరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని అప్పారెడ్డిపల్లి, మల్కిమియాన్‌పల్లి, ఈర్లతండా, అల్లమాయపల్లి, తిర్మలాయపల్లి, కమాలోద్దీన్‌పూర్ గ్రామాల్లో సింగిల్ విండో, ఐకేపీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటను దళారులకు విక్రయించి నష్టపోకుండా ఉండేందుకు ప్రభుత్వం అవసరమైన ప్రతి గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.



అప్పారెడ్డిపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు, అధికారులు

కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మల్లయ్య, ఏపీఎం రాంబాబు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్, వెంకటేశ్వర్లు, ఆగారం ప్రకాష్, రవినాయక్, రాములు, కృష్ణయ్య, విష్ణుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ముళ్లపొదలు తొలగించండి

మదనాపురం: మండలంలోని అజ్జకొల్లులో దారిపై అడ్డుగా ఉన్న ముళ్లపొదలు తొలగించాలని శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యదర్శికి గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఆయా కాలనీల్లో స్తంభాలకు వీధి లైట్లు ఏర్పాటు చేయాలని, ఎర్రగట్టు వరకు ఉన్న ముళ్లపొదలు వెంటనే తొలగించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కావలి అశోక్‌కుమార్, కృష్ణారెడ్డి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గురుకులానికి విద్యార్థినుల ఎంపిక



కొత్తకోట: మండల పరిధిలోని రామనంతపురం ప్రాథమిక పాఠశాలలోని నలుగురు విద్యార్థులు గురుకులంలో సీట్లు సాధించినట్లు ఉపాధ్యాయుడు శేఖర్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు శేఖర్ గౌడ్, సమీన బేగం, గ్రామస్తులు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల అవగాహన ర్యాలీ

వనపర్తి రూరల్: మండలంలోని చందాపూర్ గ్రామంలో శుక్రవారం వనపర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్‌– 3, 4 ఆధ్వర్యంలో వలంటీర్లు ఐదోరోజు అవగాహన ర్యాలీ నిర్వహించినట్లు ప్రోగాం కోఆర్డినేటర్ దామ్‌సింగ్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు బాల్య వివాహాలు, మత్తు పదార్థాల వినియోగం, ఆన్‌లైన్ మోసాలు, మొక్కల సంరక్షణ, ఓటు హక్కు, బెట్టింగ్ యాప్‌లు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమావేశం ఏర్పాటు చేశారు. పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యాయులు లోకమాత, శ్రీనివాస్‌రెడ్డి, బాలనాగయ్య, విష్ణువర్ధన్, కార్యదర్శి రాజేష్, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

రైతు పోరాటానికి సిద్ధం కండి

వనపర్తి రూరల్/అమరచింత/వీపనగండ్ల/పాన్‌గల్: రైతు పోరాటానికి సిద్ధం కావాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకుడు ఎండీ జబ్బార్ అన్నారు. తెలంగాణ రైతు సంఘం (ఏఐకేఎస్) 89 ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం సంఘ జిల్లా కార్యదర్శి పరమేశ్వరాచారి ఆధ్వర్యంలో వనపర్తి మండలంలోని చిట్యాల మార్కెట్ యార్డులో రైతులతో కలసి జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతాంగానికి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు నల్ల చట్టాలను వెనక్కి తీసుకోకపోతే మరో రైతంగా ఉద్యమ పోరాటం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు జగదీశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పుష్పమ్మ, నాగన్న, వెంకటయ్య, శ్రీనివాసులు, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

❒ సమస్యల సాధనకు రైతులు పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐకేఎస్ జిల్లా కోశాధికారి వెంకటేష్ అన్నారు. ఏఐకేఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అమరచింత మండలంలోని పాంరెడ్డిపల్లె గ్రామంలో జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో మోహన్, అంజిరెడ్డి శంకర్, మొగిలన్న, మాసన్నలతో పాటు పలువురు పాల్గొన్నారు.



చిట్యాల మార్కెట్ యార్డులో జెండా ఆవిష్కరణలో నాయకులు

❒ రైతుల హక్కుల కోసం అఖిల భారత రైతు కిసాన్ సభ ఎన్నో ఉద్యమాలు నిర్వహించిందని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి అన్నారు. వీపనగండ్ల మండల కేంద్రంతోపాటు బొల్లారం గ్రామంలో అఖిల భారత కిసాన్ సభ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని ఇరు గ్రామాల్లో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. 1936 ఏప్రిల్ 11న ఇట్టి మహాసభలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రైతుల కోసం ఎన్నో పోరాటాలు చేసి రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయించి గిట్టుబాటు ధర ఇప్పించడంలో కిసాన్ సభ నాయకులు ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు నాగిరెడ్డి, కృష్ణయ్య, మురళీ, ఆశన్న, సాయిలీల, చిట్టెమ్మ, రాణి, సోమేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.



పాంరెడ్డిపల్లెలో ఏఐకేఎస్ పతాకం ఆవిష్కరణలో జిల్లా కోశాధికారి వెంకటేష్

❒ పాన్‌గల్ మండలంలోని రేమద్దుల గ్రామంలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆల్ ఇండియా కిసాన్ సభ(ఏఐకేఎస్) 89వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు భాస్కర్, జిల్లా కమిటీ సభ్యుడు కె.వెంకటయ్య, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జి.వెంకటయ్య, ఎం.వెంకటయ్య, నిరంజన్, భాస్కర్‌గౌడ్, మహేష్, కేవీపీఎస్, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

వక్ఫ్ ఆస్తులు కబ్జా చేసేందుకే బిల్లు



ఆత్మకూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

ఆత్మకూర్: కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం వక్ఫ్ ఆస్తులు కబ్జా చేసేందుకే సవరణ బిల్లు తీసుకొచ్చిందని ముస్లిం సంఘాల నాయకులు ఆరోపించారు. శుక్రవారం స్థానిక ఆజంజాహి మసీదు నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు వక్ఫ్ సవరణ బిల్లుకు నిరసనగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారంటూ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా నాయకులు గయాసుద్దీన్, వాహీద్, జుబేర్ మాట్లాడుతూ.. ముస్లిం పర్సనల్ లా బోర్డుకు వ్యతిరేకంగా ముస్లింల విలువైన వక్ఫ్ ఆస్తులను కబ్జా చేసేందుకే కేంద్రం సవరణ బిల్లు తీసుకొచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుపేద ముస్లింలకు న్యాయం చేస్తామంటూ సవతి తల్లి ప్రేమను ఒలకబోస్తున్న కేంద్రం ముందుగా మణిపూర్ అల్లర్లను అరికట్టాలన్నారు. దేశంలో నిరుద్యోగం, పేదరికం పారద్రోలాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ చాంద్‌పాషకు అందజేశారు. కార్యక్రమంలో మౌలానా అబ్దుల్‌అలీం, హాఫీజ్ అజ్హర్, నాయకులు జబ్బార్, రఫీఖ్, ఉస్మాన్, అమీర్ పాల్గొన్నారు.

అమరచింత: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వక్ఫ్ సవరణ బిల్లును వెనక్కు తీసుకోవాలని శుక్రవారం పట్టణంలోని ముస్లింలు నిరసన వ్యక్తం చేశారు. జామీయా మసీదులో ప్రార్థనల అనంతరం ప్లకార్డులు పట్టుకుని నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం తహసీల్దార్ రవియాదవ్‌కు వినతిపత్రం అందజేశారు. మత స్వేచ్ఛకు, రాజ్యాంగ విరుద్ధమైన బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తౌఫిక్, షేక్‌పాష, ఆఫీస్ మౌలానా అల్తాఫ్ బేగ్, ఫరీద్, నిసార్, ఆశ్వక్, ఇమ్రాన్, సమీర్, కరీం, మోయిన్‌తదితరలు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఎంతో ప్రయోజనం

వీపనగండ్ల: చిరుధాన్యాల్లో ఎన్నో పోషక పదార్థాలు ఉంటాయని, ప్రతి నిత్యం వాటిని తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందని జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాల హెచ్‌ఎం మంజుల, ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎం సాయిలత అన్నారు. శనివారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన చిరుధాన్యాల ప్రదర్శనలో వారు పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి అంగన్‌వాడీ కేంద్రాలకు పౌష్టికాహారం అందుతుందని, వాటిని చిన్నారులు, గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుగుణాబాయ్, మహేశ్వరి, సువర్ణ, ఎల్లమ్మ, హెల్పర్లు లచ్చమ్మ, నిరంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

మా భూములు మాకు కావాలి

వనపర్తిటౌన్: మా పేరుపై పట్టా భూములు మాకు తెలియకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారులు అమ్ముకున్నారని మా భూముల కోసం మూడు నెలలుగా పోరాడుతున్నామని పట్టణంలోని దళితవాడ, మారెమ్మకుంట, గాంధీనగర్, ప్యాటగడ్డ, ఇందిరా కాలనీ, తదితర ప్రాంతాలకు చెందిన దళితులు నినదించారు. జిల్లా కేంద్రంలోని శుక్రవారం కబ్జా చేసిన భూమి చోట టెంట్ వేసి నిరసన వ్యక్తం చేశారు. మారెమ్మకుంట సమీపంలో నాలుగు ఎకరాల భూమి కొనుగోలు చేసి, అదనంగా మరో ఐదు ఎకరాలు కలుపుకొని దళితుల భూముల్లో 133, 150 పైచిలుకు గజాలతో ప్లాట్లు వేసి ఇప్పటికి 80పై చిలుకు ప్లాట్లను రియల్‌ఎస్టేట్ వ్యాపారులు అమ్ముకున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వ అండదండలతో కొందరు నాయకులు దళిత భూములపై కన్నేసి దగా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కొండన్న, బంగ్లా రవి, దేవదాసు, అడ్వకేట్ శ్యామ్ కుమార్, గంధం సత్యం, కంట్రోల్ రాములు, చెన్నారం సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న దళితులు

బీజేపీ అధికారం చేపడుతుంది

ఖిల్లాఘనపురం: వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి రాష్ట్రంలో బీజేపీ మహాశక్తిగా ఎదిగి అధికారం చేపట్టడం ఖాయమని జెడ్పీ మాజీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బెస్తగేరి కమ్యూనిటీ హాల్‌లో మండల అధ్యక్షుడు బుచ్చిబాబు గౌడ్ అధ్యక్షతన బీజేపీ ఆవిర్భావ వారోత్సవాల్లో భాగంగా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ఈనెల 13, 14 తేదీల్లో గ్రామాల్లోని దళితవాడల్లో పర్యటించడంతో పాటుగా సహపంక్తి భోజనాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు విక్రం, మండల నాయకులు శివశంకర్, గోపాల్‌రెడ్డి, గోపి ముదిరాజ్, ఈదమ్మ, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లోక్‌నాథ్‌రెడ్డి

కాంగ్రెస్ నాయకులను నిలదీయండి

ఖిల్లాఘనపురం: గణపసముద్రం చెరువు రిజర్వాయర్‌లో భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.25 లక్షల నష్ట పరిహారం ఇస్తామని మోసగించిన కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నాడు. శుక్రవారం మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య ఆధ్వర్యంలో ఖిల్లాఘనపురం పద్మశాల కళ్యాణ మండపంలో రజతోత్సవ సన్నాహక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. కాకతీయుల కాలంలో నిర్మించిన గణపసముద్రం చెరువు పునర్నిర్మాణం చేసిన ఘనత బీఆర్ఎస్ దక్కుతుందన్నారు. గణపసముద్రం చెరువు కట్ట తగ్గించడం, నాణ్యత లోపించడం తదితర విషయాలపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి లేఖ రాస్తే ఇప్పటివరకు ఎలాంటి ఉలుకు పలుకు లేదన్నారు. రజతోత్సవం కార్యక్రమంలో భాగంగా ఈనెల 27న వరంగల్‌లో నిర్వహించే సభకు మండలం నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తరలిరావాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, విజయ్‌కుమార్, మాజీ ఎంపీపీ కృష్ణానాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

భాగవత సప్తాహ పారాయణం

అయిజ: మండలంలోని చిన్నతాండ్రపాడులోని రామాలయంలో శుక్రవారం వికాస తరంగిణి జోగుళాంబ గద్వాల వారి ఆధ్వర్యంలో 18వ శ్రీమత్ భాగవత సప్తాహ పారాయణ కార్యక్రమాన్ని వేదపండితులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సప్తాహంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. 15వ తేదీ వరకు సప్తాహ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



సీతా దయాకర్‌రెడ్డికి సన్మానం



కొత్తకోట: రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ సీతా దయాకర్‌రెడ్డిని పీఆర్‌టీయూ టీఎస్ ఉపాధ్యాయులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. చైర్‌పర్సన్‌గా ఎన్నికైన సందర్భంగా అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పేరి వెంకట్‌రెడ్డి, జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి సూర చంద్రశేఖర్, రాష్ట్ర అసోసియేటెడ్ అధ్యక్షుడు భక్తరాజు తదితరులు పాల్గొన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

ఎస్.రాజేందర్ గౌడ్, ACM - 9618066349
వనపర్తి ఎం. జగదీశ్వర్ - 9912370010
కొత్తకోట / పెబ్బేర్ ఇ. రాజశేఖర్ గౌడ్ - 97000 09392
టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1003

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు :

జబ్బర్ లాల్ :
9553955603